# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 213 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | సోమవారం, 06 జులై 2026 | పేజీలు :4




## విరమణ పదవికే.. సేవకు కాదు..

- వరంగల్ ఎంపీ కావ్య

2




జీవితంలో గెలిచిన వాళ్ల గాథలు వినడానికి అందరూ ఇష్టపడతారు. కానీ, వాళ్లు గెలవడానికి చేసిన త్యాగాలు, వాళ్లు పాటించిన క్రమశిక్షణ, వాటి వెనుక ఉన్న కష్టాల గురించి తెలుసుకోవడానికి మాత్రం చాలా కొంతమందికే ఆసక్తి ఉంటుంది. అయితే ఈ మన 'ఆర్థిక అభిమన్యుల' జీవిత గాథల్లో అన్ని కోణాలను, వాళ్ల ఆలోచనలను, ఎదిగిన తీరును మొత్తం తెలుసుకుందాం..

*- మన చౌరాస్తాలో ప్రత్యేక కథనం..*

3 లో..



## కేటీఆర్ కాన్వాయ్ అడ్డగింత

- పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం
- భారీకేడ్లు తొలగించే ప్రయత్నంలో తీవ్ర ఉద్రిక్తత
- కోమల్ల టోల్‌గేట్ వద్ద సేమ్ సీన్
- నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

4



## వధశాలకు రాకుండానే మటన్ విక్రయాలు

2

- మున్సిపాలిటీ అధికారుల ఆకస్మిక దాడులు
- 120 కిలోల మటన్ స్వాధీనం.. రూ.30 వేల జరిమానా

# వధశాలకు రాకుండానే మటన్ విక్రయాలు

- **మున్సిపాలిటీ ఆకస్మిక దాడులు**
- **120 కిలోల మటన్ స్వాధీనం.. రూ.30 వేల జరిమానా**





**జనగామ, మన చౌరాస్తా :** పట్టణంలో అక్రమ మాంసం విక్రయాలు, నాణ్యతలేని మాంసం అమ్మకాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో జనగామ మున్సిపాలిటీ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. తనిఖీల్లో ఓ అక్రమ వధశాలపై దాడి చేసి సుమారు 120 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీని విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా జనగామ ప్రభుత్వ వధశాల ప్రాంగణంలో జేసీబీ సహాయంతో శాస్త్రీయ పద్ధతిలో పూడ్చివేశారు. విచారణలో కొందరు వ్యాపారులు ప్రభుత్వ అనుమతి ఉన్న వధశాలకు జంతువులను తీసుకురాకుండా, తమ సొంత ప్రాంగణాల్లో అక్రమంగా వధ చేసి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు ప్రారంభించడంతో పాటు రూ.30,000 జరిమానా విధించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాంసం అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమని, అక్రమ వధశాలలు, నాణ్యతలేని మాంసం విక్రయాలపై నిరంతర తనిఖీలు కొనసాగించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమానాస్పద మాంసం విక్రయాలు లేదా అక్రమ వధశాలల సమాచారం ఉంటే వెంటనే మున్సిపాలిటీకి తెలియజేయాలని ప్రజలను కోరారు. తనిఖీల్లో ఎస్ఐ గోపయ్య, వార్డు అధికారులు కుమార్, నిఖిల్, శేఖర్, జవాన్లు తిరుమలరాజు, కృష్ణ, లక్ష్మణ్‌తో పాటు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



# ధర్మరక్షకులను తయారుచేస్తం

- **వీహెచ్‌పీ విభాగ్ కార్యదర్శి నందాల చందర్‌బాబు**
- **జనగామలో ముగిసిన అభ్యాస వర్గ**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రతి గ్రామంలో ధర్మరక్షకులు, సమర్థవంతమైన కార్యకర్తలను తీర్చిదిద్దడమే విశ్వహిందూ పరిషత్ శిక్షణ లక్ష్యమని విభాగ్ కార్యదర్శి నందాల చందర్‌బాబు అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా నివాసిత అభ్యాస వర్గం విజయవంతంగా ముగిసింది. జిల్లా అధ్యక్షుడు ఎనగందుల బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి తెలంగాణ మాతృశక్తి సహ ప్రముఖ్ శ్రీవాణి దేవి ముఖ్య అతిథిగా, ఉమ్మడి వరంగల్ విభాగ్ కార్యదర్శి ముఖ్య శిక్షకుడిగా, పాఠశాల డైరెక్టర్ మోతే సురేందర్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు. ఈ శిక్షణలో జిల్లా స్థాయి కార్యకర్తలకు దేశం, సమాజం, ధర్మం పట్ల బాధ్యతలు, కార్యకర్త కర్తవ్యాలు, సనాతన వైదిక సంస్కృతి, శ్లోకాలు, సూక్తులు, దేశభక్తి గీతాలు, యోగాభ్యాసం, సత్సంగాల నిర్వహణ, సంస్థాగత కార్యస్వరూపం, సామాజిక సమరసత, సమతా-సౌభ్రాతృత్వం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎనగందుల బిక్షపతి మాట్లాడుతూ, సమాజ సేవ, జాతి నిర్మాణం, సనాతన ధర్మ పరిరక్షణలో విశ్వహిందూ పరిషత్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. సంస్థలో సభ్యులుగా చేరి శిక్షణ పొందడం అదృష్టంగా భావించాలన్నారు. నందాల చందర్‌బాబు మాట్లాడుతూ, కార్యకర్త సేవా దృక్పథం, కార్యదక్షత, త్యాగనిరతి కలిగి ఉండాలని, దేశం కోసం సమయాన్ని అంకితం చేసే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోహనకృష్ణ భార్గవ, సహ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు బాలనారాయణ, మాతృశక్తి సంయోజిక బుధారపు లావణ్య, సేవా ప్రముఖ్ బత్తిని శ్రీనివాస్, దుర్గావాహిని సంయోజిక బొల్లు ఝాన్సీ, శివరామ్, గుణిగంటి వెంకటేష్, సోమనర్సింహాచారి, మాసరాజు, మాదాసు రాజేశ్వర్, పోచన్న, మలిపెద్ది వెంకటేశం, అంజయ్య, విజయ్, సాగర్ పాల్గొన్నారు.

# బీఎల్‌ఏలకు ఎస్ఐఆర్‌పై అవగాహన

- **తరిగొప్పలలో కాంగ్రెస్ శిక్షణ సదస్సు**

**తరిగొప్పల, మన చౌరాస్తా:** జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో తరిగొప్పుల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఎల్‌ఏలకు ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడ శ్రీను, జనగామ మున్సిపల్ కౌన్సిలర్ కరుణాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటరు జాబితా సవరణలో బీఎల్‌ఏల పాత్రపై వివరించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# విరమణ పదవికే.. సేవకు కాదు..

- **వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**హనుమకొండ, మన చౌరాస్తా:** హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జడ్పీహెచ్‌ఎస్ చిల్పూర్ స్కూల్ అసిస్టెంట్ జుబేదా హుస్సేన్ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సదస్సులో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, పదవీ విరమణ సేవలకు ముగింపు కాదని, సమాజ సేవకు కొత్త అధ్యాయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో జుబేదా హుస్సేన్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం జుబేదా హుస్సేన్‌ను ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.




# జనగామలో బీఆర్ఎస్ లీడర్ల ముందస్తు అరెస్ట్

**జనగామ, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్ల ప్రారంభ కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు ఉందని, ఆ హక్కును హరించేలా ముందస్తు అరెస్టులు చేయడం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అరెస్టులు, బెదిరింపులు, నిర్బంధాలతో బీఆర్ఎస్ నాయకులను గానీ, ప్రజా ఉద్యమాలను గానీ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వ నిరంకుశ చర్యలకు ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

# వెల్ది గ్రామానికి బాడీ ఫ్రీజర్ విరాళం



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన ఆరేళ్ల నరసయ్య తన తల్లిదండ్రులు ఆగమ్మ-మంగయ్య జ్ఞాపకార్థం గ్రామానికి బాడీ ఫ్రీజర్‌ను విరాళంగా అందించారు. ఈ సేవా కార్యక్రమంలో ఆయన కోడలు ఉపేంద్ర భాగస్వామ్యమయ్యారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు మృతదేహాన్ని భద్రంగా ఉంచేందుకు బాడీ ఫ్రీజర్ అవసరమని గుర్తించి దీనిని విరాళంగా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారి సేవాభావాన్ని అభినందించారు. గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి సునీత-శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామానికి ఉపయోగపడే బాడీ ఫ్రీజర్‌ను అందించడం ఆదర్శనీయమన్నారు. గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ తరపున ఆరేళ్ల నరసయ్య, ఉపేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి.. 10 మంది అరెస్టు

**కొడకండ్ల, మన చౌరాస్తా:** కొడకండ్ల మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి పేరం రాము నివాసంలో పేకాట జరుగుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో దాడి నిర్వహించినట్లు ఎస్ఐ చింతరాజు తెలిపారు. దాడిలో రూ.6,230 నగదు, 8 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో పేరం రాము, బుంగి సత్యనారాయణ, పనస రాజు, అనపురం మధు, జీడిమట్ల గణేశ్‌రెడ్డి, పులిగిళ్ల ఐలయ్య, పేరం కృష్ణ, మహ్మద్ షమీన్(ఆసిఫ్), సర్దార్ రామ్మూర్తి, ముప్పిరాల లక్ష్మణాచారి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.





# కలలు... కన్నీళ్లు... అనుభవాలు... కోటీశ్వరులు!

## సంపదకు నేస్తం సమయం

- అట్లూరి గణేష్, ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్, రచయిత.

**జీవితంలో గెలిచిన వాళ్ల గాథలు వినడానికి అందరూ ఇష్టపడతారు. కానీ, వాళ్లు గెలవడానికి చేసిన త్యాగాలు, వాళ్లు పాటించిన క్రమశిక్షణ, వాటి వెనుక ఉన్న కష్టాల గురించి తెలుసుకోవడానికి మాత్రం చాలా కొంతమందికే ఆసక్తి ఉంటుంది. అయితే, ఈ మన 'ఆర్థిక అభిమన్యుల' జీవిత గాథల్లో అన్ని కోణాలను, వాళ్ల ఆలోచనలను, ఎదిగిన తీరును మొత్తం తెలుసుకుందాం...**



***హైదరాబాద్‌కు దగ్గరలోని ఒక చిన్న పట్టణం. అక్కడి ప్రభుత్వ పాఠశాలలో రీయూనియన్ జరుగుతోంది. 30 యేళ్ల కిందట ఈ స్కూల్ లో చదువుకున్న వాళ్లంతా ఎక్కడెక్కడినుంచో వచ్చారు. వారిలో ఒకే బెంచ్‌పై కూర్చుని చదువుకున్న నలుగురు క్లాస్ మేట్స్ మళ్లీ కలుసుకున్నారు. వాళ్ల పేర్లు.. అర్జున్... రవి... మహేష్... కిరణ్..***

ఒకప్పుడు ఒకే యూనిఫాం వేసుకున్న వాళ్లు, ఒకే టీచర్ల చేతిలో దెబ్బలు తిన్న వాళ్లు, ఒకే గ్రౌండ్‌లో క్రికెట్ ఆడిన వాళ్లు.. అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకుంటున్నారు. కానీ, ఇప్పుడు వాళ్ల జీవితాలు నాలుగు వేర్వేరు దారుల్లో పయనిస్తున్నాయి. అప్పుడప్పుడూ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నా.. ఇప్పుడు మాత్రం చాలా దగ్గరగా, చాలా వివరంగా ఒకరి జీవితం గురించి మరొకరు మాట్లాడుకునేందుకు అవకాశం దొరికింది. ఎవరెవరు ఏ స్థాయిలో ఉన్నారు? ఎలా గెటాన్ అవుతున్నారు? బతుకు పోరాటం చేస్తున్నారా? హ్యాపీగా డీల్ చేసుకుంటున్నారా? అన్నది కూడా చర్చించుకోవడానికి సమయం దొరికింది. తమ క్లాస్ మేట్స్ అందరినీ పలకరించడం పూర్తయ్యాక.. ఈ నలుగురూ ఒకచోట చేరారు. ఎందుకంటే చిన్నప్పటినుంచీ చాలా క్లోజ్‌గా మూవ్ అయిన బ్యాచ్ వీళ్లది. అందుకే... పర్సనల్ విషయాలన్నీ అక్కడి రీయూనియన్ హాల్లో మాట్లాడుకుంటూ ఉండగా ఒక విషయం మాత్రం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. నలుగురూ దాదాపు ఒకే స్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. నలుగురూ మధ్యతరగతి కుటుంబాల నుంచే వచ్చారు. నలుగురూ కష్టపడ్డారు... పడుతున్నారు. అయితే... వారిలో ఒకరు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించారు. ఒకరు కోటీశ్వరుడయ్యాడు. మరొకరు ఇంకా ఈఎంఐలతో పోరాడుతున్నాడు. ఇంకొకరు మంచి జీతం సంపాదించినా చేతిలో ఏమీ మిగలడం లేదు. ఎందుకు?



**నలుగురూ ఒకే స్కూల్లో చదివారు. నలుగురూ ఇంచుమించు ఒకే వయసులో జాబ్స్ మొదలు పెట్టారు. ఆ తర్వాత పెళ్లిళ్లు చేసుకున్నారు. వాళ్ల తల్లిదండ్రులందరూ కూడా యావరేజ్ ఆస్తిపాస్తులున్నవాళ్లే.. కానీ, ఇప్పుడు వాళ్ల ఫైనాన్షియల్ సిచ్యుయేషన్‌లో మాత్రం నలుగురిలో నాలుగు అంతరాలు కనిపిస్తున్నాయి. మరి.. ఈ అంతరానికి కారణం ఏమై ఉంటుంది? తేడా వాళ్ల తెలివితేటల్లో లేదు... అర్జున్ క్లాస్‌లో టాపర్ కాదు. రవి కూడా పెద్ద జీనియస్ కాదు. మహేష్, కిరణ్ కూడా అంతే. వాళ్ల IQలో కూడా ఏమంతగా వ్యత్యాసం లేదు. అలాగే, అదృష్టంలో లేదు. వారసత్వ ఆస్తుల్లో లేదు. జీతాల్లో కూడా లేదు. తేడా ఒక్కటే... డబ్బు మేనేజ్‌మెంట్‌లో వాళ్లు తీసుకున్న, తీసుకుంటున్న నిర్ణయాలు. యెస్... కేవలం వాళ్ల ఆలోచనా సరళి, నిర్ణయాల్లో సమయం, స్పష్టతే ఇప్పుడు వాళ్ల ఆర్థిక పరిస్థితుల్లో అంతరాలకు అసలైన కారణం.**


### కొత్త ఉద్యోగం - కోటీశ్వరులను చేసే నిర్ణయం

2001వ సంవత్సరం. నలుగురు ఫ్రెండ్స్‌కీ ఉద్యోగాలు వచ్చాయి. మొదటి జీతం నలుగురికీ దాదాపు రూ.10,000 నుంచి రూ.15,000 మధ్య ఫిక్స్ అయ్యింది. అప్పుడే అర్జున్ ఒక తెలివైన నిర్ణయం తీసుకున్నాడు. ప్రతి నెల కనీసం రూ.10,000 SIP లో పెట్టుబడి పెడతానన్నాడు. అప్పుడు ఆ మాట విని చాలామంది నవ్వారు. 'ఉద్యోగం వచ్చిందో, లేదో అప్పుడే వెనకేయడంపై ఆలోచన మొదలయ్యింది. అయినా.. ఇంత చిన్న జీతంలో ఇన్వెస్ట్‌మెంట్ ఏంటి?' అని ఒక రకంగా ఎగతాళి చేశారు. ముందు అందివచ్చిన జీవితాన్ని ఎంజాయ్ చెయ్యి భాయ్.. యవ్వనం అనేది ఒక్కసారే వస్తుంది... ఇప్పుడు యూత్‌గా ఎంజాయ్ చేయకపోతే, రేపు తలచుకొని బాధపడతావ్.. అంటూ టెంప్ట్ చేసే ప్రయత్నం చేశారు. ఎందుకంటే అప్పుడు తన చుట్టూ ఉన్నవాళ్లంతా యంగ్ బ్యాచే. యంగ్‌లైఫ్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటున్నవాళ్లే.. కానీ, అర్జున్ మాత్రం ఎందుకో... వినలేదు. ఎవరు ఎంతగా వెటకారంగా మాట్లాడినా.. తాను మాత్రం అనుకున్నది చేయాలనుకున్నాడు. ఇన్నాళ్లు నాకు జీతం అనేది తెలియదు. ఇప్పుడు కూడా కొన్నాళ్లు తక్కువ జీతం వచ్చినప్పుడు అలాగే అనుకుంటే పోలా.. నా చిన్న చిన్న ఖర్చులకు సరిపడా డబ్బు ఉంచుకుంటే సరిపోతుందనుకున్నాడు. ఫస్ట్ శాలరీ నుంచే SIP స్టార్ట్ చేశాడు. నిజానికి అప్పుడు అర్జున్‌కు మార్కెట్ అంటే తెలియదు. అప్ అండ్ డౌన్స్ గురించి ఐడియా లేదు. మార్కెట్‌ను అర్థం చేసుకునే అవకాశం కూడా లేదు. కానీ, తాను అనుకున్నది చేసేశాడు. ఒక్కటే అనుకున్నాడు. నా ఫ్యూచర్ బాగుండాలి. పెళ్లయ్యాక ఫ్యామిలీ సంతోషంగా ఉండాలి. అంతే.. ఎవరికీ ఇన్‌ఫ్లూయన్స్ కాకుండా.. తనకు వచ్చిన ఆలోచనను నిజం చేసేశాడు.

ఇక, వీళ్ల గ్రూప్‌లో మరొక ఫ్రెండ్ రవి ఏం చేశాడో చూద్దాం.. రవి కూడా ఎంతో కొంత ఇన్వెస్ట్ చేయాలని అనుకున్నాడు. అర్జున్‌ను ఫాలో అవుదామనుకున్నాడు. కానీ, ఇంకొంచెం జీతం పెరిగాక చూద్దాంలే అని లైట్ తీసుకున్నాడు. అప్పుడు అతని వయసు 25 సంవత్సరాలు. అయితే, అలా.. అనుకుంటూ ఐదేళ్లు వృథా చేశాడు. 30 యేళ్లకు SIPలో పెట్టుబడి మొదలుపెట్టాడు.

ఇంకో స్నేహితుడు మహేష్ ప్లాన్ చూద్దాం.. మహేష్‌కు మనీ అంటే చాలా ఇష్టం. కానీ, పొదుపు అంటే మాత్రం ఇష్టం లేదు. ఉన్న జీవితం ఒక్కటే.. దీన్ని ఇప్పుడే ఆస్వాదించాలి. సంపాదిస్తున్నప్పుడు కూడా ఫ్యూచర్ గురించి ఆలోచిస్తూ.. ఇప్పటి ఎంజాయ్‌మెంట్‌ను వదులుకుంటే ఎలా? అనుకున్నాడు. కానీ, నెమ్మదిగా ఐదేళ్లు, పదేళ్లు గడిచిపోయాయి. అర్జున్, మహేష్ SIPలలో అప్పటిదాకా పోగైన పెట్టుబడి గురించి తెలుసుకున్నాడు. తన దగ్గర చూస్తే.. బ్యాలన్స్ నిల్. వాళ్లకు మాత్రం SIPలో ఆదాయం పెరిగిపోతోంది. అప్పటికి గానీ కళ్లు తెరవలేదు మహేష్. ఇప్పటికే ఆలస్యమైంది. ఇప్పుడైనా స్టార్ట్ చేద్దాం అంటూ.. 35 యేళ్లు వచ్చాక వాళ్లిద్దరి మాదిరిగానే SIP స్టార్ట్ చేశాడు. అంటే.. అర్జున్ అప్పటికే SIP స్టార్ట్ చేసి పదేళ్లయ్యింది. రవి కూడా SIP మొదలెట్టి ఐదేళ్లు దాటింది.

ఇక, వీళ్ల తదుపరి బెంచ్‌మేట్ కిరణ్ విషయం చూస్తే.. అతనికి కూడా అందరితో పాటే జాబ్ వచ్చింది. కొద్దిగా అటూ ఇటూగా అందరితో పాటే పెళ్లి చేసుకున్నాడు. జీతం విషయంలో కూడా మరీ నిరాశ ఏమీ లేదు. మంచి జీతమే వస్తోంది. కానీ, స్టేటస్ వైపు, మోడర్న్ లైఫ్ వైపు టర్న్ అయ్యాడు. పెట్టుబడులు పక్కన బెట్టాడు. ఫ్రెండ్స్ అప్పుడప్పుడూ గుర్తు చేసినా SIP గురించి పట్టించుకోలేదు. కార్లు, మోడర్న్ గాడ్జెట్లు, ఫైవ్ స్టార్ ట్రిప్స్, క్రెడిట్ కార్డులు, EMIలు.. ఇలా జీవితాన్ని లాక్కుంటూ వెళ్తున్నాడు. ఇవే అతని జీవితాన్ని నడిపించాయి. ఇప్పటికీ నడిపిస్తూనే ఉన్నాయి. ఇక, సేవింగ్స్ విషయానికి వస్తే.. తర్వాత చూద్దాంలే.. అనుకుంటూ వాయిదాలు వేశాడు. అయితే.. కిరణ్ అనుకున్న 'తర్వాత' అనేది ఎప్పుడూ రాలేదు. అలా క్రెడిట్ కార్డులు, EMIలతో లైఫ్‌ను లాక్కుంటూ వెళ్తున్నాడు.




### కాలం - అదృశ్య నేస్తం

**కాలం నిశ్శబ్దంగా తన పని చేసుకుంటూ వెళ్లింది. మార్కెట్ పెరిగింది. పడిపోయింది. మళ్లీ పెరిగింది. 2008లో క్రాష్ వచ్చింది. ప్రపంచమంతా భయపడింది. చాలామంది ఈ పరిస్థితులు చూసి భయంతో వెనకడుగు వేశారు. మార్కెట్లలో ఇన్వెస్ట్‌మెంట్లు ఆపేశారు. కానీ, అర్జున్ మాత్రం భయపడలేదు. తన పెట్టుబడి ఆపలేదు. ఆ తర్వాత మరోసారి.. క్రాష్. 2020లో కరోనా వచ్చింది. మార్కెట్లు కుప్పకూలాయి. ప్రపంచమంతా మళ్లీ భయం అలుముకుంది. మళ్లీ మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. అయినా.. అర్జున్ మాత్రం తన SIP కొనసాగిస్తూనే ఉన్నాడు. ఎందుకంటే.. SIPకి భవిష్యత్తు చెప్పే జ్యోతిష్కుడు అవసరం లేదు. డిసిప్లిన్ గా ఉండే పెట్టుబడిదారుడు చాలు. అది అర్జున్ అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు. కాబట్టి తనకు మరో పొదుపు మార్గం అవసరం అన్న పరస్థితి రాలేదు. రవి, మహేష్ కూడా కాస్త భయపడినా SIP ఆపేయలేదు.**

### తెలివైన నిర్ణయం విలువ

రీ యూనియన్ రోజున నలుగురు మిత్రులూ ఒక టేబుల్ చుట్టూ కూర్చున్నారు. మాటల మధ్య డబ్బు ప్రస్తావన వచ్చింది. అప్పుడు అందరూ తమ ఆర్థిక స్థితి గురించి చెప్పుకుంటున్నారు. అర్జున్.. 25 ఏళ్ల వయసులో ప్రారంభించాడు. ప్రతి నెలా రూ.10,000 SIP కడుతున్నాడు. 25 సంవత్సరాలు కంటిన్యూ చేశాడు. ఇప్పుడు అతని సంపద అందరికీ చూపించాడు. యాప్ ఓపెన్ చేసి తన SIP అకౌంట్ లో బ్యాలన్స్ మిగతా ముగ్గురికీ చూపించాడు. SIP ద్వారా అర్జున్ సంపాదన ఇప్పుడు రూ.1.90 కోట్లు. ఆ బ్యాలన్స్ చూసి అందరూ కళ్లు తేలేశారు. అది నిజమా? కాదా? అని కాసేపు నమ్మలేదు కూడా.. కానీ, అది అర్జున్ నిజమైన బ్యాలన్స్.

రవి.. 30 ఏళ్ల వయసులో SIP స్టార్ట్ చేశాడు. సేమ్.. అర్జున్ మాదిరిగానే.. నెలకు రూ. 10,000 కట్టాడు. 20 సంవత్సరాల పాటు అలా నెలకు రూ.10,000 చెల్లించాడు. ఇప్పుడు రవి సంపద.. మిగతా ఇద్దరూ ఇంట్రస్ట్‌గా చూస్తున్నారు. తన యాప్ ఓపెన్ చేసి SIP బ్యాలన్స్ చూపించాడు. అక్షరాలా రూ.1.00 కోటి.

ఇక, మహేష్ 35 ఏళ్ల వయసులో SIP ప్రారంభించాడు. మిగతా ఇద్దరు మిత్రుల మాదిరిగానే నెలకు. రూ.10,000 SIP కట్టాడు. 15 సంవత్సరాలు మాత్రమే కంటిన్యూ చేయగలిగాడు. ఎందుకంటే మిగతా ఇద్దరికంటే పది సంవత్సరాలు లేట్‌గా స్టార్ట్ చేశాడు. ఇప్పుడు మహేష్ సంపద... కిరణ్.. ఆదుర్దాగా అతని మొబైల్ వంకే చూస్తున్నాడు. మహేష్.. తన మొబైల్ లో యాప్ ఓపెన్ చేసి SIP బ్యాలన్స్ చూపించాడు. SIPలో పెట్టుబడి పెట్టడం వల్ల మహేష్ సంపాదించిన మొత్తం రూ.50 లక్షలు.

చివరగా అందరూ కిరణ్ వైపు అతని పరిస్థితేంటన్నట్టు చూశారు. వీళ్ల ముగ్గురి మాదిరిగానే మంచి ఉద్యోగమే. 25 సంవత్సరాల పాటు మంచి జీతం సంపాదించాడు. లక్షల రూపాయలతో కార్లు కొన్నాడు. ఫారిన్ ట్రిప్‌లు తిరిగొచ్చాడు. అప్‌డేట్ అవుతున్న ప్రతిసారీ కొత్త మొబైల్ ఫోన్ కొంటూ వచ్చాడ. కానీ, అతని నికర సంపద? దాదాపు సున్నా. అంతేకాదు.. తాను కట్టాల్సిన కొన్ని EMIలు ఇంకా మిగిలే ఉన్నాయి. ఆ విషయం చెబుతూ.. తల దించుకున్నాడు. తన తోటి ఫ్రెండ్స్ పక్కా ప్లాన్‌తో, ఫైనాన్షియల్ డిసిప్లేన్‌తో ఈరోజు లక్షలు, కోట్లు బ్యాలన్స్ కూడబెడితే.. తాను మాత్రం అప్పులతో కుస్తీ పడుతున్నాడు. అతని ముఖంలో దిగులు స్పష్టంగా కనిపించింది. మిగతా ముగ్గురూ అతని హావభావాలు చూసి ధైర్యం చెప్పారు. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఫ్రెండ్ తేరుకునేలా అభయం ఇచ్చారు. అలా అని కిరణ్ ఇప్పటివరకు అవసరాలకోసం ఎవరిపైనా ఆధారపడలేదు. కానీ, సంపద కూడబెట్టలేకపోయాడు. అందుకే వాళ్లముందు చిన్నతనంగా ఫీలయ్యాడు.

### టైమ్ మ్యాజిక్

ఇప్పుడు కిరణ్ సంగతి పక్కనబెట్టి.. మిగతా ముగ్గురి లెక్కలు చూద్దాం... అర్జున్, రవి, మహేష్ ముగ్గురూ.. ఒకే మొత్తం SIP చేశారు. ప్రతినెలా కట్టుకుంటూ పోయారు. కానీ, అర్జున్ బ్యాలన్స్ రూ.1.90 కోట్లు. రవి బ్యాలన్స్ రూ.1 కోటి. మహేష్ సంపద మాత్రం రూ.50 లక్షలు. వీళ్ల రాబడిలో ఇంతగా డిఫరెన్స్ ఎందుకొచ్చిందంటారు. ఇక్కడే అసలు మ్యాజిక్ ఉంది. అర్జున్ పెట్టిన డబ్బు పెద్దదేమీ కాదు. ప్రతి నెలా రూ.10,000 మాత్రమే. అది ఎవరైనా చేయగలిగే సేవింగ్. కానీ, అతను కొన్నది మ్యూచువల్ ఫండ్ యూనిట్లు కాదు. టైమ్‌ని.. అవును, సమయాన్ని.. అదే, కాలాన్ని. మనం ఎలా చెప్పుకున్నా టైమ్ అనేది మన సంపదను పెంచుకుంటూ పోయే అదృశ్య నేస్తం. సంపదను నిర్మించేది డబ్బు అని అందరం అనుకుంటాం. కానీ, డబ్బు మాత్రమే కాదు.. సమయం కూడా. ఈ ముగ్గురు మిత్రుల SIP పెట్టుబడులు చూస్తే మనకు అర్థం అయ్యింది కదా.. అర్జున్ ఏకంగా దాదాపు రూ.2 కోట్లు వెనకేశాడు. రవి రూ.1 కోటి సంపాదించాడు. మహేష్ మాత్రం ఆలస్యంగా స్టార్ట్ చేయడం వల్ల రూ.50లక్షలే సంపాదించగలిగాడు. అందుకే ఒక ఆర్థిక నిపుణుడు అంటారు.. 'Compounding is the eighth wonder of the world.'. అవును.. నిజం. చక్రవడ్డీ అనే మహాశక్తి చిన్న మొత్తాలను పెద్ద సంపదగా మార్చుతుంది. కానీ, దానికి తగిన సమయం ఇవ్వాలి.

### నాగరిక మోహం

ఈరోజు నాగరిక సమాజం మనల్ని ఆవహించింది. నీ దగ్గర ఏముంది?.. అన్నదే నీ సంపదకు, స్టేటస్‌కు, విజయానికి కొలమానం అంటోంది. అందుకే... కొత్త ఫోన్, కొత్త బైక్, కొత్త కారు, కొత్త EMI, కొత్త అప్పు.. మెజారిటీ మనుషుల జీవితం ఇలాగే సాగుతోంది. సోషల్ మీడియాలో కనిపించే జీవితాన్ని ఫాలో కావడానికి.. చాలామంది తమ భవిష్యత్తునే తాకట్టు పెడుతున్నారు. కానీ, ధనవంతులు అనుసరించే విధానమే వాళ్లను అలా నిలబెడుతుంది. చాలామంది ధనవంతులు ఎక్కువ ఖర్చు చేస్తారని అపోహలో ఉంటారు. కానీ, నిజానికి.. ధనవంతులు ముందు పెట్టుబడి పెడతారు. మిగిలినదాన్ని ఖర్చు చేస్తారు. కానీ, పేదలు, మధ్యతరగతి ప్రజలు మాత్రం ముందు ఖర్చు చేస్తారు. సంపాదనలో ఏదైనా మిగిలితే అప్పుడు పొదుపు చేస్తారు. అదే అసలు తేడా... కలలు అందరికీ ఉంటాయి. అర్జున్‌కూ కలలు ఉన్నాయి. రవి కూడా పెద్ద ఇంటి గురించి కలలు కన్నాడు. మహేష్ కూడా విదేశీ పర్యటనల గురించి ఆలోచించాడు. కిరణ్ కూడా తన కుటుంబానికి మంచి జీవితం ఇవ్వాలని కోరుకున్నాడు. కలలు అందరికీ ఉంటాయి. అలాగే, కన్నీళ్లు కూడా అందరికీ వస్తాయి. 2008లో మార్కెట్ పడిపోయినప్పుడు అర్జున్ భయపడ్డాడు. 2020లో ఉద్యోగ భద్రత గురించి టెన్షన్ పడ్డాడు. అతనికీ కష్టాలు వచ్చాయి. మిగతా అందరి మాదిరిగానే ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. కన్నీళ్లు కూడా అందరికీ వస్తాయి. కానీ జీవితాల కథల్లోనే అసలు తేడా ఉంటుంది. జీవితాలు బాగుపడేవి అదృష్టం వల్ల కాదు. జీతం వల్ల కాదు. డిగ్రీ వల్ల కూడా కాదు. మన ఆర్థిక అలవాట్లు మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. ఈ నలుగురు మిత్రుల జీవితాలను పరిశీలిస్తే.. మూడు గొప్ప ఆర్థిక సూత్రాలు ఉన్నాయి. అవేంటంటే..

1. త్వరగా ప్రారంభించండి.. పెట్టుబడి మొత్తం ఎంతన్నది ఆలోచించకండి.. చిన్న మొత్తమైనా పర్వాలేదు.. ప్రారంభించిన సమయం ముఖ్యం. అచ్చం అర్జున్ మాదిరిగానే...
2. మార్కెట్‌ను ఊహించడానికి ప్రయత్నించకండి. భవిష్యత్తును ఎవరూ చెప్పలేరు. కానీ, క్రమంగా పెట్టుబడి పెట్టడం మాత్రం మనచేతుల్లోనే ఉంటుంది.
3. ఏదేమైనా సరే.. .ఆగిపోకండి. సంపదను నిర్మించేది తెలివితేటలు, పెట్టుబడుల మార్పిడులు కాదు. పెట్టుబడి కంటిన్యూ చేయడం. చివరిదాకా కొనసాగించడం.

### గుర్తుంచుకోండి...

**కలలు అందరూ కంటారు. కన్నీళ్లు కూడా అందరికీ వస్తాయి. కానీ, కోటీశ్వరులను అలా చేసేది వాళ్ల జీతం కాదు.. వాళ్ల ఆర్థిక క్రమశిక్షణ. ఫైనాన్షియల్ డిసిప్లేన్. మార్కెట్ ఎప్పుడు పడిపోతుందో ఎవరికీ తెలియదు. కానీ, సమయానికి మొదలుపెట్టిన SIP ఎప్పుడో ఒకరోజు మీకు అండగా ఉంటుందనేది మాత్రం చరిత్ర నిరూపిస్తోన్న సత్యం. పొదుపును రేపటికి వాయిదా వేసినవారు జీవితపు బండిని లాక్కుంటూ వెళ్తూనే ఉంటారు. పొదుపును ఈరోజే ప్రారంభించినవారు భవిష్యత్తును నిర్మించుకుంటారు. ఎందుకంటే... కోటీశ్వరులను తయారు చేసేది పెద్ద జీతాలు కాదు... చిన్న మొత్తాలతో ప్రారంభమై కొనసాగే పెద్ద క్రమశిక్షణ. గుర్తుంచుకోండి.. 'డబ్బును సంపాదించడం ఒక నైపుణ్యం... దాన్ని నిలబెట్టుకోవడం ఒక విజ్ఞానం..'**

### లైఫ్ లెస్సన్

**రీయూనియన్ ముగిసింది. నలుగురు ఫ్రెండ్స్ బయటకు వచ్చారు. పాత పాఠశాల బిల్డింగ్ వైపు ఒకసారి తిరిగి చూశారు. అర్జున్‌లో భావోద్వేగం ఉప్పొంగింది. మనసులోనే తనకు విద్యాబుద్ధులు చెప్పిన స్కూల్‌కు కృతజ్ఞతలు చెప్పుకుంటూ... మిగతా ముగ్గురినీ ఉద్దేశించి అన్నాడు. 'మన జీవితాల్లో పెద్ద మార్పులు తెచ్చిన నిర్ణయాలు చాలా చిన్నవే. ప్రతి నెలా రూ.10,000 అంటే.. మొదట్లో అమ్మో.. అనుకున్నా ఆ తర్వాత ఒక కాఫీ తాగినంత సులభంగా కనిపించే నిర్ణయం. కానీ, అదే నిర్ణయం.. 25 సంవత్సరాల తర్వాత నన్ను కోటీశ్వరుడిగా మార్చింది.' అది విన్న ముగ్గురూ నిజమేరా.. అనుకుంటూ ముందుకు సాగారు.**





# కేటీఆర్ కాన్వాయ్ అడ్డగింత

- పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం
- భారీకేడ్లు తొలగించే ప్రయత్నంలో తీవ్ర ఉద్రిక్తత
- కోమల్ల టోల్‌గేట్ వద్ద సేమ్ సీన్
- నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

**జనగామ, మన చౌరాస్తా:**

కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాన్వాయ్‌ను జనగామ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పరిమిత సంఖ్యలో వాహనాలకే అనుమతి ఇస్తామని పోలీసులు తెలపడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, బారికేడ్లు తొలగించే ప్రయత్నంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెంబర్తి వద్ద తన కాన్వాయ్‌లోని వాహనాలను నిలిపివేయడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తనతో వచ్చే వాహనాలకు అనుమతి ఇస్తేనే ముందుకు వెళ్తానని, లేదంటే అక్కడే ధర్నాకు కూర్చుంటానని ప్రకటించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత కొనసాగింది.

## జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్..

పోలీసులు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల వాహనాలకు మాత్రమే అనుమతి ఇవ్వడంతో కేటీఆర్ వరంగల్ వైపు బయలుదేరారు. అయితే మిగతా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల వాహనాలను నిలిపివేయడంతో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సుమారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## కోమల్ల టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే పల్లా, డీసీపీ వాగ్వాదం..

కోమల్ల టోల్‌గేట్ వద్ద కూడా కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని, శాంతియుతంగా వెళ్తున్న నాయకులను అడ్డుకోవడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపుతో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## స్టేషన్ ఘనపూర్‌లో కేటీఆర్‌కు రాజయ్య స్వాగతం..

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలతో ఆయనకు స్వాగతం చెప్పారు.





కన్నెపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**